క్లుప్తంగా

కొట్లాటలకు పాల్పడితే కఠిన చర్యలు



ప్రత్తిపాడు: గొడవల్లో తల దూర్చడం, కొట్లాటలకు పాల్పడటం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ప్రత్తిపాడు ఎస్ఐ రౌడీ షీటర్లకు హెచ్చరికలు జారీ చేశారు. స్థానిక పోలీస్ స్టేషనులో శుక్రవారం రౌడీ షీటర్లుకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎన్నికల సమయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. వివాదాల్లోకి వెళ్లడం, అల్లర్లు, గొడవలకు పాల్పడటం వంటివి చేస్తే ఎలాంటి పరిస్థితుల్లోనూ ఉపేక్షించమన్నారు. ప్రతి రోజూ కదలికలపై పూర్తి స్థాయి నిఘా ఉంచుతామన్నారు. ఏ చిన్న అనుమానం తలెత్తినా అదుపులోనికి తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

నల్లపాడు సీఐగా నరేష్ కుమార్



గుంటూరు రూరల్: నల్లపాడు పోలీస్ స్టేషన్ నూతన సీఐగా డి నరేష్ కుమార్ శుక్రవారం పదవీ భాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన సీఐ సస్పెండ్ కావటంతో బదిలీలలో భాగంగా ఐజీ పాలరాజు నరేష్ కుమార్‌ను నల్లపాడు పోలీస్‌స్టేషన్ సీఐగా నియమించారు. గతంలో ఆయన దిశ పోలీస్ స్టేషన్, నగరం పాలెం, చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లలో సీఐగా విధులు చేపట్టారు.

వైఎస్సార్ సీపీ జిల్లా మైనార్టీ కార్యదర్శిగా అసదుల్లా



కాకుమాను: మండలంలోని కొమ్మూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ ముజావర్ షేక్ అసదుల్లా మైనార్టీ జిల్లా కార్యదర్శిగా ఎన్నికైనట్లు జెడ్పీటీసీ సభ్యురాలు షేక్ గుల్జార్ బేగం శుక్రవారం తెలిపారు. అసదుల్లా మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీలో కీలక పదవులు చేపట్టడంతో పాటు మండలంలో పార్టీని బలోపేతం చేయడానికి ఎంతో కృషి చేసినట్లు ఆమె తెలిపారు. పార్టీలో క్రియాశీలకంగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేసే ప్రతి ఒక్కరికీ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని ఆమె తెలిపారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలోని మైనార్టీలందరినీ ఏకతాటిపై నడిపించి పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని అసదుల్లా తెలిపారు.ఈ సందర్భంగా అసదుల్లాను పలువురు మైనార్టీ నాయకులు అభినందించారు.

పేకాటరాయుళ్లపై కేసు నమోదు

పెదకాకాని: పేకాట ఆడుతున్న 8 మందిపై కేసు నమోదైంది. మండల పరిధిలోని తంగెళ్లమూడి గ్రామ శివార్లలోని సపోటా తోటలో పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ముందస్తు సమాచారం అందుకున్న పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. 8 మంది పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.60,570 నగదు, 8 బైక్‌లు స్వాధీనం చేసున్నారు. కేసు నమోదు చేసినట్లు సీఐ కె వీరాస్వామి తెలిపారు.

20 నుంచి ఏపీ ఈఏపీ సెట్, నీట్‌కు ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో ఈనెల 20 నుంచి ఏపీ ఈఏపీ సెట్, నీట్‌కు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఉచిత శిక్షణ తరగతుల్ని నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి. మల్లికార్జునప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజువారీ తరగతులతో పాటు వారాంతపు గ్రాండ్ టెస్ట్‌లను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 98851 98640, 83329 11155 నంబర్లలో సంప్రదించాలని కోర్సు కో–ఆర్డినేటర్ డాక్టర్ ఏ. మంజుశ్రీ సూచించారు.

సోషల్ మీడియాపై నియంత్రణ అవసరం

లక్ష్మీపురం: సోషల్ మీడియాపై ప్రభుత్వ నియంత్రణ అవసరమని అవగాహన సంస్థ సభ్యుడు, ఇంజినీర్ ఎస్.సదాశివం కోరారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం 'గాడి తప్పుతున్న సోషల్ మీడియా' అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియా విచ్చలవిడితనం పేట్రేగి పోతోందని, సెలబ్రిటీల నుంచి సామాన్యుల వరకు వేధింపుల బారిన పడుతున్నారని తెలిపారు. గీతాంజలి లాంటి సున్నిత మనస్కులు ఆత్మహత్యలకు పాల్పడటం ఆందోళనకరమని పేర్కొన్నారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న గీతాంజలికి సంస్థ సభ్యులు నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యావేత్త ఆర్.వి. సింగరయ్య, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, న్యాయవాది అవధానుల హరి పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

నగరంపాలెం: నడిచి వెళ్తున్న మహిళ మెడలో బంగారు గొలుసు తెంచుకెళ్లిన ఘటనపై పట్టాభిపురం పీఎస్‌లో కేసు నమోదైంది. విద్యానగర్ ఒకటో వీధిలో శుక్రవారం సాయంత్రం అత్తోట అరుంధతి నడిచి వెళుతున్నారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకుల ఓ పాఠశాల సమీపాన ఆమె మెడలోని బంగారు గొలుసు తెంచుకెళ్లారు. దీనిపై బాధితురాలు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



సత్కార గ్రహీతలతో సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న వైఎస్సార్ సీపీని రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించే విధంగా నాయకులు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో మురళీకృష్ణ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లాలో పలు విభాగాల్లో పార్టీ పదవుల్లో నియమితులైన పొన్నూరు నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులకు అభినందన సభ నిర్వహించారు. పట్టణానికి చెందిన గుంటూరు జిల్లా మహిళా కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మూకిరి అనిలా కుమారి, జిల్లా సేవాదళ్ కార్యదర్శులు ఆరేటి మధుసూదన్ రావు, వేముల మూర్తి రాజు, జిల్లా ట్రేడ్ యూనియన్ సంయుక్త కార్యదర్శి పలగాని రమేష్, జిల్లా వాణిజ్య విభాగ సంయుక్త కార్యదర్శి సయ్యద్ గౌస్, జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవరకొండ గోపి, నిడుబ్రోలుకు చెందిన జిల్లా వికలాంగుల విభాగ కార్యదర్శులు కాట్రగడ్డ విజయకుమార్, కొల్లూరు నవీన్, చేబ్రోలుకు చెందిన జిల్లా పంచాయతీ రాజ్ కార్యదర్శి పరిమి సత్యలను సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఘనంగా సత్కరించి అభినందించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పదవులు పొందిన ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీ గెలుపే ధ్యేయంగా బాధ్యతతో పనిచేయాలని కోరారు.

వైఎస్సార్ టీయూసీ కమిటీ ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు గానూ పట్టణానికి చెందిన పండ్ల వ్యాపారి అంబటి చంద్రశేఖరరావు శుక్రవారం పార్టీ కార్యాలయంలో పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణను మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పండ్ల వ్యాపారులు మురళీకృష్ణను సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు అంబటి వెంకటేశ్వరరావు, విజయ్, రత్నం, రమణ, శేఖర్, లాడెన్, శివన్నారాయణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో ప్రజారోగ్యానికి భరోసా

పొన్నూరు: ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేసి ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తుందని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని నండూరు గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించి వైద్య సిబ్బంది చేపడుతున్న ఆరోగ్య పరీక్షలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సభలో మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలలో ఏడు రకాల వైద్య పరీక్షలు చేసి నిర్ధారణ అయిన వ్యాధి నయమయ్యేంత వరకు సరిపడా మందులు అందిస్తున్నట్లు తెలిపారు. వ్యాధి తీవ్రత ఆధారంగా మెరుగైన చికిత్స కోసం ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ వైద్యశాలల్లో పూర్తిస్థాయిలో వైద్యాన్ని అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకు వరం లాంటిదని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ అక్కి నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ నాజర్, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ

బాధితులకు ఆర్థిక సాయం అందజేత

పొన్నూరు: మండలంలోని మామిళ్లపల్లి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక పూరిల్లు, రెండు గడ్డి వాములు దగ్ధం కాగా ఒక గేదె మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న అగ్ని మాపక సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసినా ఫలితం దక్కలేదు. పొన్నూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అగ్ని ప్రమాదంలో నష్టపోయిన బాధిత కుటుంబాలను పరామర్శించి వారికి ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వం నుంచి నష్ట పరిహారాన్ని అందించే విధంగా చేస్తానని బాధితులకు భరోసా ఇచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాడలేని ఓటరు జాబితాలు

- పోలింగ్ బూత్‌ల వద్ద కానరాని వైనం
- ఎన్నికల అధికారుల తీరుతో ఓటర్లకు ఇక్కట్లు

ప్రత్తిపాడు: జనవరి 22న ఓటరు ముసాయిదా జాబితాను అధికారులు ప్రచురించారు. అందులో పెద్ద ఎత్తున తప్పులు దొర్లాయి. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ మార్పులు చేర్పులకు అవకాశం కల్పించింది. నామినేషన్లకు పది రోజుల ముందు వరకు క్లెయిమ్‌లు దాఖలు చేసుకునేందుకు సమయం ఉంది. బీఎల్‌వోలు జాబితాలను పోలింగ్‌కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచక పోవడం, వారు ఎక్కడ విధుల్లో ఉంటారో తెలియకపోవడంతో ఓటర్లు జాబితాల కోసం కార్యాలయాలు, పోలింగ్ బూత్‌ల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుంది. మండలంలో 40కు పైగా పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. 95 శాతం పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్ల జాబితాలు అందుబాటులో లేని పరిస్థితి చోటు చేసుకుంది. పట్టించుకోవాల్సిన ఎన్నికల అధికారులు, మండల స్థాయి అధికారులు తమకేమీ సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తుండటంతో ఓటర్లకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని ఓటర్ల జాబితాలు అందుబాటులో ఉంచాలని ఓటర్లు కోరుతున్నారు.

జాబితాలు హెచ్‌ఎంలకు ఇచ్చాం

ఓటర్ల జాబితాలను పోలింగ్ బూత్‌ల వద్ద ఉంచితే ఎవరైనా తీసుకువెళతారేమోనని ప్రత్తిపాడులో ఉన్న రెండు పాఠశాలల్లో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు జాబితాలను ఇచ్చాం. వారి వద్దకు వెళ్లి ఓటర్ల జాబితాలు తీసుకుని పరిశీలించుకోవచ్చని ప్రత్తిపాడు మండల ఎన్నికల డీటీ సుభాష్ 'సాక్షి'కి తెలిపారు. అయితే 'సాక్షి' ఆయా పాఠశాలల హెచ్‌ఎంలను వివరణ కోరగా ప్రత్తిపాడు హైస్కూల్ హెచ్‌ఎం మాకు ఎలాంటి జాబితాలు ఇవ్వలేదని చెప్పారు. ప్రత్తిపాడు హెచ్‌ఈ మెయిన్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మాత్రం ఒక్కరోజు ఇచ్చి, ఆ రోజే వెంటనే తీసుకొని వెళ్లిపోయారని, మా వద్ద ఉంచలేదని చెప్పడం గమనార్హం.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండగ



రంజాన్ ప్రార్థనలో పాల్గొన్న మురళీ కృష్ణ, ముస్లిం మత పెద్దలు

పెదకాకాని: ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక రంజాన్ అని పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. పెదకాకాని పాతూరు ముస్లింపాలెంలో ఎంపీటీసీ సభ్యురాలు షేక్ గుల్జార్ షరీఫ్ నివాసంలో శుక్రవారం ఉపవాస దీక్ష చేస్తున్న వారికి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పాల్గొన్నారు. ముందుగా పవిత్ర రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఉపవాస ప్రార్థనల అనంతరం వారికి స్వయంగా భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం మత పెద్దలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పేదోడి సొంతింటి కల సాకారమే జగనన్న లక్ష్యం



ఇళ్ల పట్టాల లబ్ధిదారులతో ఎంపీపీ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి

పెదకాకాని: ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం, ఇల్లు నిర్మాణం వైఎస్సార్ సీపీ తోనే సాధ్యమని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అన్నారు. పెదకాకాని మండలంలోని అనుమర్లపూడి, తంగెళ్ళమూడి, డీబీపాలెం గ్రామాల్లో నివాస స్థలాలు లేని నిరుపేదలను గుర్తించి అనుమర్లపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు కేటాయించారు. వారందరికీ గ్రామ సచివాలయంలో శుక్రవారం ఇళ్ల పట్టాలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి పేదవాడికి ఇంటి స్థలం, ఇల్లు ఉండాలనే ఆశయంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దాదాపు 30 లక్షల మందికి పైగా ఇళ్ల స్థలాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. పెదకాకాని మండలంలోని దాదాపు 2 వేల మంది లబ్ధిదారులకు రాజధాని ప్రాంతంలో ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తే గృహ నిర్మాణాలు జరగకుండా టీడీపీ నాయకులు న్యాయస్థానం ద్వారా అడ్డుకున్నారన్నారు. అనుమర్లపూడి గ్రామంలో ఇళ్ల స్థలాలు ఇచ్చిన జగనన్న కాలనీలో ఇప్పటికే 90 శాతం ఇంటి నిర్మాణాలు పూర్తి అయ్యాయన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా దూసుకు పోతుందన్నారు. ముఖ్యంగా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాల నగదు నేరుగా అర్హత కలిగిన మహిళల బ్యాంకు ఖాతాలకు జమ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది, లబ్ధిదారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై శ్రద్ధ పెట్టండి

చిన కాకుమాను(కాకుమాను): ఆరోగ్య సిబ్బంది ప్రతి రోజు ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కాకుమాను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ రాజశేఖర్ అన్నారు.ఫ్రైడే డ్రైడే సందర్భంగా మండలంలోని చిన కాకుమాను గ్రామంలో శుక్రవారం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఉత్తమ వలంటీర్‌కు సత్కారం

పెదకాకాని: ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయటంలో వలంటీర్ షేక్ అమీర్ బాషా సేవలు ప్రశంసనీయమని మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్ హుస్సేన్ అన్నారు. పెదకాకాని 5వ సచివాలయం పరిధిలో వలంటీర్‌గా పనిచేస్తున్న షేక్ అమీర్ బాషాను స్థానిక మహిళలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఘనంగా సత్కరించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదవాలి

మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ సీనియర్ టెక్నికల్ మేనేజర్ వడ్లమాని మధు



అతిథులను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: జీవితంలో ఉన్నత శిఖరాలను చేరేందుకు విద్య ఒక్కటే సాధనం కాదని మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ సీనియర్ టెక్నికల్ మేనేజర్ వడ్లమాని మధు తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న 'సోవమ్ 2024' యువజనోత్సవాల్లో శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీటెక్ విద్యార్థులకు తమ నాలుగేళ్ల విద్యాకాలం ఎంతో విలువైనదని అన్నారు. పంచాయితీరాజ్ ప్రాజెక్ట్ అడ్వయిజర్ యాగంటి నరసింహారావు మాట్లాడుతూ విద్యార్థులు నిత్య జీవితంలో నిత్యం నూతన విషయాలు నేర్చుకుంటూ మల్టిపుల్ టెక్నాలజీపై దృష్టి సారించి ముందుకు సాగాలన్నారు. చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులకు విద్యతో పాటు మంచి నైపుణ్యాలు పెంపొందించేందుకు, పట్టుదలతో ముందుకు సాగేందుకు అన్ని రకాల సౌకర్యాలను తమ కళాశాల కల్పిస్తుందన్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వై సుజిత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి సరైన నిర్ణయాలు తీసుకొని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎమ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఏటా సోవమ్ పేరుతో నిర్వహించే టెక్నికల్ ఈవెంట్‌లో విద్యార్థులకు విద్యతో పాటు, సాంస్కృతిక, క్రీడా రంగాల్లో పట్టు సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సోవమ్ కన్వీనర్ డాక్టర్ పీ బాలాజీ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కళాశాలల నుంచి 2 వేల మంది విద్యార్థులు ఈ టెక్నికల్ ఈవెంట్‌లో పాల్గొన్నారని వారికి వివిధ రకాల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అంజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథులను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించారు.

మహిళాభ్యుదయంతోనే దేశ ప్రగతి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: మహిళా శక్తిని ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని, అన్ని రంగాల్లో మహిళలకు సమాన ప్రాతినిధ్యం కలిగించినప్పుడే దేశ ఆర్థిక ప్రగతి వృద్ధి చెందుతుందని ప్రముఖ న్యాయవాది, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, డొమెస్టిక్ వాయిలెన్స్ సెల్ కౌన్సిలర్ కేవీ పద్మావతి పేర్కొన్నారు. చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమంలో శుక్రవారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుంటున్నారన్నారు. విద్యార్థినులకు మహిళా చట్టాలపై అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్విజ్, నృత్యం, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ రాధారాణి, డాక్టర్ జి సుధావాణి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంలో అన్నదాత ఆందోళన

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని గ్రామ సచివాలయంలో ఓ రైతు చేసిన హడావుడితో అధికారులు ఖంగు తిన్నారు. వివరాల్లోకి వెళితే ప్రత్తిపాడు పంచాయతీ పరిధిలోని తూర్పుపాలెంకు చెందిన డి.ఆశీర్వాదం అనే రైతుకు 64 సెంట్లు భూమి ఉంది. ఇటీవల జరిగిన భూముల రీ సర్వేలో భాగంగా స్థానిక సర్వేయర్లు అతని భూమిని కొలిచారు. ఆ సమయంలో భూమి అంతా బాగానే ఉందని, ఎలాంటి ఇబ్బందులూ లేవని చెప్పారు. అయితే సదరు రైతు బ్యాంకులో ఉన్న తన రుణాన్ని రెన్యువల్ చేసుకునేందుకు వెళ్లాడు. సిబ్బంది తాజా అడంగల్, 1బిలు తీసుకురమ్మని చెప్పారు. దీంతో అతను అడంగల్ తీయించాడు. అందులో తనకున్న 64 సెంట్లుకు బదులు 25 సెంట్లు చూపించడంతో రైతు అధికారుల తీరుపై తీవ్ర స్థాయిలో మండిపడ్డాడు. పొలం కొలిచినప్పుడు తగ్గని నా భూమి, ఇప్పుడు ఎలా తగ్గిందని అక్కడ ఉన్న సిబ్బందిని ప్రశ్నించారు. ఆ సమయంలో సర్వేయర్లు లేకపోవడంతో సచివాలయ ఉద్యోగులు నచ్చజెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో ఆ రైతు తన టవల్‌ను సచివాలయ బయట ఉన్న గ్రిల్స్‌కు చుట్టి, తనకు న్యాయం చేయకపోతే ఇక్కడే ఈ టవల్‌ను మెడకు చుట్టుకుని ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించాడు. ఊహించని పరిణామంతో ఒక్కసారిగా ఉలిక్కిపడ్డ సచివాలయ ఉద్యోగులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలికి చేరుకుని రైతుతో మాట్లాడారు. ఇంతలో వీఆర్వోలు, స్థానిక నాయకులు రైతుకు నచ్చజెప్పారు. సర్వేయర్లు వచ్చిన తరువాత విషయం తెలుసుకొని న్యాయం చేస్తామని చెప్పడంతో ఆ రైతు శాంతించి వెళ్లిపోయాడు.

జర్మన్ భాష శిక్షణ తరగతులు ప్రారంభం



అవగాహన ఒప్పంద పత్రాలు చూపుతున్న వినోద్‌కుమార్, కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: జర్మనీలో హెల్త్‌కేర్ రంగంలో విద్యార్థులకు మంచి అవకాశాలున్నాయని ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం నల్లపాడు గ్రామంలోని సెయింట్ జోసఫ్ నర్సింగ్ కళాశాలలో క్యూరా పర్సనల్, ఏపీఎస్ఎస్‌డీసీ సహకారంతో జర్మన్ నర్సింగ్ ఉద్యోగ అవకాశాల కోసం జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ జర్మనీలో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు విద్యార్థులకు అవసరమైన జర్మన్ భాషపై ఉచితంగా శిక్షణ ఇచ్చేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పీ ప్రణయ్ మాట్లాడుతూ ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, క్యూరా పర్సనల్ సంస్థతో కళాశాల త్రైపాక్షిక ఒప్పందం చేసుకోవటం జరిగిందన్నారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు జర్మన్ భాషపై శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ ఈడీ జి అనిల్‌కుమార్, క్యూరా పర్సనల్ సంస్థ సీఈవో కృష్ణజవాజీ, సంస్థ డైరెక్టర్ అప్పన హేమ, సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి వల్లి, జీఎమ్‌జే కోఆర్డినేటర్, హెల్త్ కేర్ అపోస్టలేట్ సిస్టర్ క్లిటస్, గుంటూరు ప్రావిన్స్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విక్టోరియా, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ లిస్సీథామస్, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అసోసియేట్ మేనేజర్ వినయ్‌భూషణ్, ఎస్ఎస్‌డీవో రెహనాఖాన్, అధికారులు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే అందరి లక్ష్యం కావాలి



మాట్లాడుతున్న అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: వైఎస్సార్ సీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. పెదకాకాని మండల వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మురళీకృష్ణ మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను ఆదర్శంగా తీసుకుని భజరంగ్ ఫౌండేషన్‌ను స్థాపించి జగన్నామ సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకు వెళుతున్నామన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని 60 గ్రామాల్లో పర్యటించి 23 వేల మందికి కళ్ళజోళ్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. గుండె సమస్య ఉన్న వారికి ఏంజియోగ్రామ్‌లు, జైపూర్ కాళ్లు, ట్రై సైకిళ్లు అందజేయడం జరిగిందన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్న ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీలో పదవులు ఉన్నవారు, నూతనంగా పదవులు పొందిన వారు, పదవులు రాని వారు అంతా కలసి ఐకమత్యంతో పనిచేసి పార్టీ విజయంలో భాగస్వాములు కావాలన్నారు. శక్తి వంచన లేకుండా పనిచేసిన వారికి ప్రభుత్వ ప్రోత్సాహం తప్పక లభిస్తుందన్నారు. ఇటీవల పదవులు పొందిన వారిని సత్కరించి అభినందనలు తెలియజేశారు. జిల్లా సాంస్కృతిక విభాగం ప్రధాన కార్యదర్శి కొండమడుగుల సాంబిరెడ్డి, జిల్లా పంచాయతీరాజ్ సెక్రటరీ పెరుమాళ్ల అనిల్‌కుమార్, జాయింట్ సెక్రటరీ పోతురాజు గోపి, జిల్లా ట్రేడ్ యూనియన్ సెక్రటరీలు డాక్టర్ షేక్ గౌస్, షేక్ ఆదాం(కాలు), కార్యదర్శి కొండమడుగుల వెంకటరెడ్డి, రైతు విభాగం జనరల్ సెక్రటరీ జొన్నల శివారెడ్డిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, అగతవరప్పాడు సర్పంచి పిట్టు శివకృష్ణారెడ్డి, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న చందు సాంబశివరావు, అత్తోట వినీతారాణి

చేబ్రోలు: గ్రామాభివృద్ధే ధ్యేయంగా మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని వేజండ్ల సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులోని యడ్లపాటినగర్‌లో రూ.10.80 లక్షల వ్యయంతో నిర్మించనున్న సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన నిర్వహించారు. యడ్లపాటినగర్‌లోని ట్యాంక్ రోడ్డు ప్రాంతంలో పలు చోట్ల పంచాయతీ నిధులతో సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన కొనసాగిస్తున్నారని అన్నారు. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య సహకారంతో కోట్లాది రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. పంచాయతీ సర్పంచ్ అత్తోట వినీతారాణి మాట్లాడుతూ అందరి సహకారంలో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇంజినీరింగ్ అసిస్టెంటు శివలీల, ఉప సర్పంచ్ చౌడయ్య, పరిమి సత్యనారాయణ, శంకర్, పంచాయతీ నెంబర్లు, స్థానిక నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

నేడు వలంటీర్ల ఆత్మీయ సమావేశం

పెదకాకాని: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందజేయడంలో వారధులుగా పని చేస్తున్న వలంటీర్ల ఆత్మీయ సమావేశం శనివారం జరుగుతుందని పెదకాకాని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు తెలిపారు. ముఖ్య అతిథిగా నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. పొన్నూరు నియోజకవర్గ వ్యాప్తంగా జరిగే ఈ ఆత్మీయ సమావేశం ఉదయం 9 గంటలకు పొన్నూరు మున్సిపాలిటీకి సంబంధించిన వారికి పొన్నూరు ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ రోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో జరుగుతుందన్నారు. 11:30 గంటలకు అదే కార్యాలయంలో పొన్నూరు రూరల్ మండలం వలంటీర్లకు జరుగుతుందన్నారు. చేబ్రోలు పరిమి సత్యన్నారాయణ కల్యాణ మండపంలో సాయంత్రం 3 గంటలకు వెనిగండ్ల మైత్రి కల్యాణ మండపంలో పెదకాకాని మండల వలంటీర్లకు ఆత్మీయ సమావేశం జరుగుతుందని ఎంపీపీ తెలిపారు. ఈ ఆత్మీయ సమావేశానికి వలంటీర్లు తప్పక హాజరు కావాలని కోరారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు కవాతు



చేబ్రోలు: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో చేబ్రోలు ఎస్ఐ పి మహేష్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం పలు గ్రామాల్లో పోలీసు కవాతు నిర్వహించారు. మండల కేంద్రమైన చేబ్రోలు, మంచాల తదితర గ్రామాల్లోని ప్రధాన రహదారి ప్రాంతాల్లో కవాతు నిర్వహించారు. ఎస్ఐ పి మహేష్ కుమార్ మాట్లాడుతూ పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో సజావుగా జరిగేందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా కవాతు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీఆర్పీఎఫ్ పోలీసులు, స్థానిక పోలీసులు కవాతులో పాల్గొన్నారు.